క్లుప్తంగా

అధినేతతో భేటీ



మంగళగిరిలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి కారుమూరి, కొల్లేరు నేత మోరు రామరాజు

దెందులూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మంగళగిరిలో ఆయన నివాసంలో రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కొల్లేరు నేత మోరు రామరాజు, విజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ జగన్‌కు మోరు రామరాజు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కారుమూరి పరిచయం చేశారు. ఈ సందర్భంగా మోరు రామరాజు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని, అక్రమ కేసులు పెట్టారని వైఎస్ జగన్‌కు వివరించామన్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారని రామరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.

పెదపాడు తహసీల్దార్‌గా కృష్ణ జ్యోతి



పెదపాడు తహసీల్దార్ కృష్ణ జ్యోతికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్వోలు వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది

పెదపాడు: పెదపాడు తహసీల్దార్‌గా ఎ. కృష్ణ జ్యోతి విధుల్లో చేరారు. శుక్రవారం మండలంలోని వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, వీఆర్వోల సంఘం రాష్ట్ర కోశాధికారి బెవర కోటేశ్వరరావు, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, నటరాజన్‌దాసు పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో అగ్నిప్రమాదం

దెందులూరు: గోపన్నపాలెంలో గురువారం రాత్రి కొండేటి వెంకన్నకు చెందిన ప్రభు కిరాణా జనరల్ స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న గోపన్నపాలెం వీఆర్వో రంగనాథ్ ప్రమాదానికి గురైన కిరాణా షాప్‌కి వెళ్లి పరిశీలించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.15 లక్షలకు పైగా ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధమైందని తెలిపారు. నివేదికను దెందులూరు మండల తహసీల్దార్ బి. సుమతికి అందజేస్తానని ఆయన వివరించారు.

వ్యాసరచనలో సత్తాచాటిన నారాయణపురం విద్యార్థిని



గొంతిన కావ్యను అభినందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: వ్యాసరచన పోటీలో జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన నారాయణపురం హైస్కూలు విద్యార్థిని గొంతిన కావ్యను హెచ్ఎం మీరాసాహెబ్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. కావ్యకు రూ.3 వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను డీఎంఅండ్‌హెచ్‌వో ద్వారా విద్యాశాఖాధికారి అందజేశారు. గైడు టీచరు గొల్లపల్లి రామారావు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి భూమి పూజ

ఉంగుటూరు: మండలంలో పల్లెపండుగ కార్యక్రమం ఎ.గోకవరం, నీలాద్రిపురం, కైకరం, తల్లాపురం, నాచుగుంట, సీతారామపురంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రూ.1.41 కోట్ల విలువగల రహదారుల అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ పల్లెపండుగ ద్వారా గ్రామాల్లో సాగునీరు, తాగునీరు, రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు పంది రాంబాబు, ఆయా గ్రామాల కూటమి నాయకులు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

దెందులూరు: సీతంపేట గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో పార్ట్‌టైం ఉద్యోగిగా పనిచేస్తున్న కాలి చంద్రబాబు శుక్రవారం విద్యుత్ స్తంభం ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. అతని తలకి దెబ్బతగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని హుటాహుటిన ఏలూరు ఆంధ్రా హాస్పిటల్ తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సిఫార్సు మేరకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు, సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, టీడీపీ నాయకులు కాలి చంద్రబాబును పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

సార్వా వరి పైరుపై తెగుళ్ల ఉధృతి

- చిరుపొట్ట దశలో వెంటాడుతున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు
- ముమ్మరంగా నివారణ చర్యలు



తెగుళ్ల నివారణకు పెదవేగిలో మందులు పిచికారీ చేస్తున్న రైతులు

పెదవేగి : సార్వా వరి పైరుపై తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంది. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ఖరీఫ్ పంటపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో ఉల్లికోడు, తెల్లదోమ, మాగుడు తెగుళ్లు ఆశించి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. నివారణ చర్యలతో పెట్టుబడి తడిసి మోపడవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లికోడు నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

41,500 ఎకరాల్లో సాగు

నియోజకవర్గంలోని పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో ఖరీఫ్‌లో 41,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశల్లో ఉంది. ఈ దశలో పలుచోట్ల మాగుడు, తెల్లదోమ, ఉల్లికోడు ఉండటం రైతులను కలవరపరుస్తోంది. మాగుడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో తెల్ల దోమ బెడద అధికంగా ఉందని రైతులు అంటున్నారు. తెల్లదోమ ఆకుల్లో రసాన్ని పీల్చేయడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయంటున్నారు. ఉల్లికోడు ప్రభావంతో వరి దుబ్బు మధ్యలోని ఆకులు చుట్ట బెట్టుకుపోయి వెన్ను రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఆయా తెగుళ్ల పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, నివారణ కోసం ఎకరాకు రూ. వెయ్యి వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందంటున్నారు.

దోమ ఆశించడానికి కారణాలు

సాధారణంగా సెప్టెంబర్ నుంచి ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడాలి. అందుకుభిన్నంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న అధిక ఉష్ణోగ్రతలు, వాతావారణంలో తేమ అధికంగా ఉండడం, ఉక్కపోత వాతావరణం దోమ ప్రబలడానికి దోహదమవుతుంది. దీనికి తోడు ఏడాది పొడవునా వరి సాగు చేయడం, నారు దశ నుంచే రైతులు రెండు, మూడు రకాల పురుగు మందులను మిశ్రమం చేసి పిచికారీ చేయడం, నత్రజని కలిగిన ఎరువులను మోతాదుకు మించి వాడడం దోమ వృద్ధి చెందడానికి కారణంగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పురుగు మందులు అతిగా వాడవద్దు

వరి పైరును తెల్ల దోమ, సుడి దోమ తొలి దశలో ఆశిస్తుంది. రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులను వాడకూడదు. దీంతో దోమలు అధికంగా ప్రబలుతాయి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఎం ప్రియాంక, మండల వ్యవసాయాశాఖాధికారి

నివారణ ఇలా..

తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెదవేగి వ్యవసాయాధికారి ఎం ప్రియాంక వివరించారు. మాగుడు నివారణకు అరికట్టేందుకు ఎక్సాకొనేజాల్ లేదా వెలిడామైసిన్ మందును లీటర్ నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణ కోసం ఎసిపేట్ మందును లీటర్ నీటికి 1.6 గ్రాములు చొప్పున ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లికోడుకు తెగులుకు నివారణ లేదని, పొలంగా తెగులు కనిపిస్తే మిగిలిన దుబ్బులకు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా కార్బోసిరాన్ లేదా, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 10 కిలోలు చొప్పున వేయాలన్నారు.

పీఎంపీ అసోసియేషన్ సేవలు విస్తృతం



వీబీటీ రాజును అభినందిస్తున్న జిల్లా పీఎంపీ సంఘం నాయకులు

గణపవరం: పీఎంపీ అసోసియేషన్ తరఫున జాతీయస్థాయిలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీనికి పీఎంపీ సభ్యులంతా సహకరించాలని పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు కోరారు. శుక్రవారం తాడేపల్లిగూడెంలో నూతనంగా జాతీయ పీఎంపీ అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వీబీటీ రాజును గణపవరం పీఎంపీ అసోసియేషన్ తరఫున కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గణపవరం పీఎంపీ అసోసియేషన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, వైద్యపరమైన అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఏపీ పీఎంపీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు నిడమర్తి జయసూర్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, గణపవరం మండల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం .సత్యనారాయణ మూర్తి, అప్పారావు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామ సభలను వినియోగించుకోవాలి



భీమడోలు: పోలసానిపల్లిలో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీపీ, తహసీల్దార్

నిడమర్రు: గతంలో రీసర్వే చేసిన గ్రామాల్లో వాటికి సంబంధించిన ఏపీ రీసర్వే ప్రాజెక్ట్ కింద వినతులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆముదాలపల్లిలో గత ప్రభుత్వంలో నిర్వహించిన శాశ్వత భూహక్కు– భూ రక్షణ పథకంలో చేపట్టిన సర్వేకు సంబంధించి అభ్యంతరాలు, వినతులు స్వీకరించేందుకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అందిన వినతులు 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నరసింహపురం రెవెన్యూ గ్రామ రీసర్వేకు సంబంధించిన వినతుల స్వీకరణకు పెదనింద్రకొలను –2 గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ గ్రామ సభను ప్రజలు, రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం

దెందులూరు: భూ యజమానులకు శాశ్వత మేలు జరిగేలా నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం గ్రామంలో మండల తహసీల్దార్ రమణారావు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పలు సమస్యలపై లిఖితపూర్వకంగా గ్రామసభలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ స్వామి, ఆర్ఐ హేమమాలిని, మేధినరావుపాలెం వీఆర్వో రవి, సిబ్బంది, రైతులు, నాయకులు ఉన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భీమడోలు: రైతుల భూ సమస్యలకు భూసర్వే శాశ్వత పరిష్కారమని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. పోలసానిపల్లిలో శుక్రవారం భూ సర్వేపై అభ్యంతరాలపై జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ సర్వే చేపట్టిందని, తద్వారా రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. అదే విధంగా రైతుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ రైతుల భూముల విషయంలో ఎటువంటి అభ్యంతరాలున్నా వాటిని లిఖితపూర్వకంగా తెలియజేస్తే 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వినతులు, ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, గ్రామకార్యదర్శి జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్ రాజు, రైతులు పాల్గొన్నారు.



నిడమర్రు: రీసర్వేకు సంబంధించిన వినతులు పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు



దెందులూరు: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

రెండు రేషన్ దుకాణాలు సీజ్



పెదనింద్రకొలను రేషన్ షాపులో బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న డీటీ జరీనా

నిడమర్రు: బియ్యం పంపిణీకి సంబంధించిన స్టాక్‌లో అవకతవకలు ఉండటంతో మండలంలో రెండు రేషన్ దుకాణాలను సీజ్ చేసినట్లు నిడమర్రు సివిల్ సప్లై డీటీ జరీనా తెలిపారు.శుక్రవారం నిడమర్రు మండలంలోని పలు రేషన్ దుకాణాల్లోని స్టాక్‌ను తనిఖీ చేశారు. పెదనింద్రకొలనులోని 0525005 రేషన్ దుకాణంలో ఈపీఓఎస్ మిషన్ ప్రకారం బియ్యం నిల్వలు 4,400 కిలోలు ఉండాలి. అయితే దుకాణంలో 421 కిలోలు మాత్రమే బియ్యం నిల్వలున్నాయి. మిగిలిన 3,619 కిలోల బియ్యం స్టాక్ డీలర్ మద్దిరాల వెంకట రామారావు వద్ద భౌతికంగా లేదు. చిననింద్రకొలనులోని 0525010 రేషన్ దుకాణంలో ఈపీఓఎస్ మిషన్ ప్రకారం 1,320 కిలోల బియ్యం నిల్వలు ఉండాలి. ఆ దుకాణంలో తనిఖీ సమయంలో 264 కిలో బియ్యం ఉంది. మిగిలిన 1,056 కిలోల బియ్యం స్టాక్ డీలర్ యు.అప్పలరాజు వద్ద భౌతికంగా లేకపోవడంతో ఆ రెండు రేషన్ షాపులను సీజ్ చేసి తనఖీల నివేదికను ఉన్నత అధికారులకు పంపినట్లు డీటీ జరీనా తెలిపారు. సీజ్ చేసిన రెండు షాపులకు సంబంధించిన రేషన్ పంపిణీ ఆయా గ్రామాల్లోని ఇతర డీలర్లకు అప్పగించినట్లు డీటీ జరీనా తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన నిత్యవసర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎస్. నాగరాజు హెచ్చరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు



భీమడోలులో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బి.రమాదేవి

దెందులూరు: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల జాబితాను తాజాగా తయారు చేయడానికి గత నెల 30న పబ్లిక్ నోటీస్ జారీ చేసిందని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. వచ్చే నెల 6న ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి చివరి తేదీ అని తెలిపారు. పలు ప్రక్రియల అనంతరం అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించి డిసెంబర్ 30న తుది జాబితా జారీ చేస్తామన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఫారం–18 పూర్తి చేసి ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు జతపరిచి తహసీల్దార్, ఎంఈఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో అందించాలన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ఓటు నమోదు చేసుకోండి

భీమడోలు: అర్హత గల పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు ఓటు నమోదుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. ముసాయిదా ప్రచురణ నవంబర్ 23న చేస్తామని, ఆ రోజు నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను తెలియజేసుకోవాలన్నారు. డిసెంబర్ 30న తుది ప్రచురణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఐ కిరణ కుమారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రామకుర్తి నాగేశ్వరరావు, ఆర్.లింగరాజు, ఉండవల్లి బాలానందం, వై.ఏడుకొండలు, ప్రవీణ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం



బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ అప్పారావు

గణపవరం: బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, వాటిని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం తహసీల్దార్ వి అప్పారావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం వెలగపల్లి గ్రామ సచివాలయం వద్ద జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా దినోత్సవం సందర్భంగా వారి సంరక్షణకు మనమంతా పునరంకితం కావాలన్నారు. బాలికలకు యుక్తవయస్సు వచ్చేవరకూ వివాహం చేయరాదని, దీనివల్ల ఆరోగ్యపరమైన అనేక సమస్యలు జీవితాంతం వెంటాడతాయన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈసందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ

నిడమర్రు: 18 ఏళ్లకంటే తక్కువ వయస్సున్న బాలికలకు వివాహం చేస్తే బాల్య వివాహాల నిషేధిత చట్టం కింద సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తారని ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రార్థనలో విద్యార్థులతో బాల్య వివాహాలు చేసుకోమని, ప్రోత్సహించమని ప్రతిజ్ఞ చేయించారు. పెదనింద్రకొలను జెడ్పీసూల్లో హెచ్ఎం టీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: అగ్నిప్రమాద బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని నాగులు దేవునిపాడు ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ గ్జేవియర్ అన్నారు. శుక్రవారం ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయిన నాగులదేవునిపాడు గ్రామానికి చెందిన నందేటి యేసమ్మను ఫాదర్ కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఇంటి సామగ్రి, ఆర్థిక సహాయాన్ని ఫాదర్ గ్జేవియర్ అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పాతటైరులో పెరుగుతున్న దోమల లార్వాను చూపుతున్న వైద్య సిబ్బంది



పూళ్లలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, డాక్టర్ కల్యాణి మహేశ్వరి

గణపవరం: మన ఇల్లు, ఇంటి పరిసరాల పరిశుభ్రత మన బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ కృషి చేస్తే అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడు, కాశిపాడులో డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి మురుగునీటి నిల్వల్లో పెరుగుతున్న దోమల లార్వాను మహిళలకు చూపి వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, రెండు గ్రామాల పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతో మెలగాలి

భీమడోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. పూళ్ల గ్రామంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కల్యాణి మహేశ్వరితో కలిసి జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ పురవీధుల్లో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సీహెచ్‌వో ఇందిర, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



దెందులూరు: రాష్ట్రస్థాయి పోటీలకు ఆయా విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు



ఉంగుటూరు: విద్యార్థి లిఖితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: రాష్ట్రస్థాయి పోటీలకు కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్వీజీ శర్మ, ఎస్ఎంసీ చైర్మన్ బేడా గణేష్ అన్నారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న 69వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్‌కు రాష్ట్రస్థాయి పోటీలకు బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో అండర్–14, 17 బాలురు, బాలికలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జే సురేష్ కుమార్, జీ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శర్మ, ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహంతోనే సాధ్యపడిందని పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఏ.సుధారాణి, ఎస్ఎంసీ చైర్మన్ గణేష్ అన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ఉంగుటూరు: ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో నిర్వహించిన అండర్–14 స్కూల్ గేమ్స్ బాల బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలో కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుప్పాల లిఖిత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబరులో విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో లిఖిత పాల్గొననుందని ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. విద్యార్థినికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిన జి.నాగసుధ, పాపాయమ్మలను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, సభ్యురాలు కాటి కుసుమాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు గ్లోరి ఎంపిక



గ్లోరి

ఉంగుటూరు: తణుకు ఉమెన్స్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ షటిల్ పోటీల్లో నారాయణపురం హైస్కూల్ విద్యార్థిని బట్టు గ్లోరి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, శిక్షణనిచ్చిన స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బేతాళ రాణి తదితరులు గ్లోరీని అభినందించారు.